శోభి

కూనలమ్మ పదాలు

డా. శోభన్ బాబు బొలుగాని

SHOBHI KOONALAMMA PADAALU
Telugu Poetry By
Dr. SHOBHANBABU BOLUGANI

27 December, 2025

ISBN : 978-93-5619-830-2

e-book released by

Dr.SHOBHANBABU BOLUGANI
S/O PITCHAIAH BOLUGANI
Peddamupparam
Danthalapalle
Mahabubabad
Telangana State,India
506324

bsb271@gmail.com
Mobile: +919701181271

WRITTEN PERIOD : 2017 Onwards

అంకితం



అక్షరార్చకుడు

శిష్య రక్షకుడు

శతక ప్రియుడు

సహృదయాసీనుడు

శతాధిక సాహిత్య సభా ప్రాసంగికుడు

శ్రీ గన్నమరాజు గిరిజామనోహర బాబు గారికి....

నాపై, అన్న రాములుపై

చూపించిన ఆదరాభిమానాలకు

కృతజ్ఞతలతో......

కూనలమ్మ పదాలు

ఉత్త మాటలు వద్దు
చెత్త రాతలు వద్దు
కొత్త చేతలు ముద్దు
ఓ కూనలమ్మా ! 1

కూలిచచ్చిన చోటు
కూడుకున్నది లోటు
దేశ భవితకు చేటు
ఓ కూనలమ్మా ! 2

తాను నేసిన చీర
ఉరికి పనికొచ్చెనుర
తనపైనె కప్పేర
ఓ కూనలమ్మా ! 3

ప్రభువులను నమ్మారు
పోరులో దిగినారు
కొలువులకు చుక్కెదురు
ఓ కూనలమ్మా ! 4

శోభన్ బాబు బొలుగాని

కూనలమ్మ పదాలు

నాతి వలువలు వొలిసి
చెత్త కవితలు రాసి
కాడా కవి తా మసి
ఓ కూనలమ్మా ! 5

తగిన సాయము గోరు
మనుజులెందరొ గలరు
చేయ ముందుకు రారు
ఓ కూనలమ్మా ! 6

ఫోను చేసెడి మేలు
ఫోను పంచిన సాలు
ఫోను తోడనె కూలు
ఓ కూనలమ్మా ! 7

ముద్ద మింగడు వాడు
పొద్దు గడవదు చూడు
ఫోను దాచిన నేడు
ఓ కూనలమ్మా ! 8

శోభన్ బాబు బొలుగాని

అందమైనది పల్లె
సర్దుకున్నది ముల్లె
పట్టణాలకు వెళ్ళె
ఓ కూనలమ్మా ! 9

కళ్ల మంటలు పెరిగె
కడుపు మంటలు పెరిగె
మానవత్వము తరిగె
ఓ కూనలమ్మా ! 10

నాయకుల గొలిచేరు
పదవులను పట్టేరు
లంచాలు మెక్కేరు
ఓ కూనలమ్మా ! 11

తాళి కట్టిన దాని
తన్ని చంపుట మాని
ఏలుకో అద్దాన్ని
ఓ కూనలమ్మా ! 12

రాముడే దేవుండు
రావణుడె భక్తుండు
సత్య శోధన మెండు
ఓ కూనలమ్మా ! 13

పడతి చూసిన చూపు
అంతరార్థము వలపు
కలయికకు మేల్కొలుపు
ఓ కూనలమ్మా ! 14

గాడి తప్పిన వాని
గాట పెట్టిన ఘనుని
పొగడాలి ఎంతేని
ఓ కూనలమ్మా ! 15

ఉన్నదంతయు అమ్మి
ఆడినాడవు రమ్మి
ఆశ చెడ్డది సుమ్మి
ఓ కూనలమ్మా ! 16

మంది కొంపలు ముంచి
అందినంతగ దోచి
పాపమున్నది వేచి
ఓ కూనలమ్మా ! 17

ఆస్తులను పెంచారు
ఆప్తులను మరిచారు
నయము చీమల బారు
ఓ కూనలమ్మా ! 18

ముల్లు పోలిన తులువ
పంపినాడే నలువ
కుళ్ళుకున్నది విలువ
ఓ కూనలమ్మా ! 19

కోరి వచ్చిన దాన్ని
కాల దన్నే వాన్ని
అంటారు మూర్ఖుడని
ఓ కూనలమ్మా ! 20

కూనలమ్మ పదాలు

ఐన వాళ్లను నమ్మి
మోసపోతివి దొమ్మి
డబ్బు చెడ్డది సుమ్మి
ఓ కూనలమ్మా ! 21

నేత మాటలు కల్ల
ప్రజల బతుకులు డొల్ల
రాజకీయము వల్ల
ఓ కూనలమ్మా ! 22

మాయ మరుగుల పేటి
రాజకీయము లూటి
తనకు తానే సాటి
ఓ కూనలమ్మా ! 23

కలవు ఎన్నో కథలు
కడుపు నింపని వెతలు
రాజకీయపు సుతలు
ఓ కూనలమ్మా ! 24

గూడు మారే పక్షి
కూడు దోచే కుక్షి
అంతరాత్మయె సాక్షి
ఓ కూనలమ్మా ! 25

కులమతమ్ములు రెచ్చి
రేపుతున్నవి పిచ్చి
మరల పుట్టకు చచ్చి
ఓ కూనలమ్మా ! 26

మందు కొంపల దూరి
మంది కొంపల గోరి
నరుడు మాయలమారి
ఓ కూనలమ్మా ! 27

అందముగ కూర్చారు
ఆదర్శమైనారు
ఆరుద్ర జోహారు
ఓ కూనలమ్మా ! 28

విదుర నీతులు చాలు
వేమనోక్తులు చాలు
ఆచరించిన మేలు
ఓ కూనలమ్మా ! 29

కోపాలు పాపాలు
పాపాలు శాపాలు
శాపాలు శూలాలు
ఓ కూనలమ్మా ! 30

తలకు మించిన పనులు
తనకు పంచిన పనులు
చేయువారే ఘనులు
ఓ కూనలమ్మా ! 31

కారు కూతల నోరు
చారు కోతల జోరు
నాయకుడి సరిలేరు
ఓ కూనలమ్మా ! 32

ఓట్ల కోసము వేచి
నల్ల డబ్బును దాచి
చివర పట్టెను పాచి
ఓ కూనలమ్మా ! 33

తప్పులెన్నో చేసి
అప్పులెన్నో మేసి
నరుడు కాడా దాసి
ఓ కూనలమ్మా ! 34

రైతు కష్టము చెక్కు
పాడి పంటలు దక్కు
కడుపు నిండగ మెక్కు
ఓ కూనలమ్మా ! 35

కంది పోయిన రైతు
చితికిపోయిన రైతు
ఏటేట నేజూతు
ఓ కూనలమ్మా ! 36

పదవి ఉంటే చాలు
పలికేరు జేజేలు
తప్పులన్నియు కూలు
ఓ కూనలమ్మా ! 37

రాజకీయము రంకు
ఓటరన్నకు జంకు
ఓట్ల తంతే బొంకు
ఓ కూనలమ్మా ! 38

సామ్యవాదము చూడ
కటిక పేదకు కూడ
కడుపు నింపే జాడ
ఓ కూనలమ్మా ! 39

పాల నవ్వులు కొన్ని
పసిడి నవ్వులు కొన్ని
చిన్న పిల్లలవన్ని
ఓ కూనలమ్మా ! 40

కూనలమ్మ పదాలు

మావూరి వాడంచు
మాకులము వాడంచు
లోకమాలోచించు
ఓ కూనలమ్మా ! 41

పదవికెక్కిన వాడు
పనులు చేసిన నాడు
వేనోళ్ల కొనియాడు
ఓ కూనలమ్మా ! 42

తల్లిదండ్రులు కొన్న
కొత్త బట్టల కన్న
పాత సెల్లే మిన్న
ఓ కూనలమ్మా ! 43

వర్షమన్నది లేదు
హర్షమన్నది లేదు
కర్షకుడి గతిలేదు
ఓ కూనలమ్మా ! 44

కూనలమ్మ పదాలు

మమత పంచని వాడు
మదము తుంచని వాడు
మనుజ జన్మకు కీడు
ఓ కూనలమ్మా ! 45

కలము నమ్మిన వాడు
పొలము నమ్మిన వాడు
ఎన్నటికి చెడిపోడు
ఓ కూనలమ్మా ! 46

అనుదినము భోగాలు
రాగాల రోగాలు
కలియుగపు తీరాలు
ఓ కూనలమ్మా ! 47

పదవులను చేపట్టి
పడతులను చెరబట్టి
బుఱ్ర తిన్నది మట్టి
ఓ కూనలమ్మా ! 48

దానమిచ్చేడి చేయి
జ్ఞానమిచ్చేడి వాయి
కల్గివుండిన హాయి
ఓ కూనలమ్మా ! 49

మజ్జిగన్నము చలువ
మంచి గంధము చలువ
మంచి మాటలు చలువ
ఓ కూనలమ్మా ! 50

కడుపు కోతలు కొన్ని
కడుపు కోతలు కొన్ని
కడుపు కోసము అన్ని ?
ఓ కూనలమ్మా ! 51

పాత దంతా రోత
అందరిప్పటి యువత
తెలివి లేముల చేత
ఓ కూనలమ్మా ! 52

కూనలమ్మ పదాలు

పేద చేస్తే తప్పు
పెద్ద చేస్తే ఒప్పు
ఎప్పుడో కనువిప్పు ?
ఓ కూనలమ్మా ! 53

బతుకు నందలి భ్రాంతి
చెరుప జాలును కాంతి
చివర మిగులును శాంతి
ఓ కూనలమ్మా ! 54

కృష్ణ తత్వము ఘనత
కృష్ణ లీలల కవిత
ఆరుద్ర కడు పూత
ఓ కూనలమ్మా ! 55

సీను సీనుకు వధలు
నేటి సినిమా కథలు
బుద్ధి పట్టును చెదలు
ఓ కూనలమ్మా ! 56

కనులు ఉండిన చాలు
కలలు నాటిన చాలు
కళలు పండును వేలు
ఓ కూనలమ్మా ! 57

పనులు ఉండిన చాలు
తినుట కుండిన చాలు
ఘనులు కారా నరులు
ఓ కూనలమ్మా ! 58

మంచి చేసే వాడు
వంచనకు గురికాడు
విభీషణ చెలికాడు
ఓ కూనలమ్మా ! 59

రాముడంతటి వాడు
నింద మోసెను నాడు
మనమెంత ఈనాడు
ఓ కూనలమ్మా ! 60

చిన్న పిల్లల గూడి
తీర్చు కొనగా వేడి
మరణ దండన పాడి
ఓ కూనలమ్మా ! 61

దేశ దేశాలందు
అభివృద్ధి పథమందు
అందమే కద ముందు
ఓ కూనలమ్మా ! 62

ఉడుకు రక్తము వల్ల
అధిక వేగము వల్ల
బతుకు నిలుచుట కల్ల
ఓ కూనలమ్మా ! 63

రాజకీయము వింత
ఓటరన్నల చింత
గంతకు తగిన బొంత
ఓ కూనలమ్మా ! 64

తమో గుణము కన్న
రాక్షసత్వము ఉన్న
మానవత్వము సున్న
ఓ కూనలమ్మా ! 65

తిండి తిప్పలు మాని
కూడబెట్టెద రేని
కూడు పెట్టదు హాని
ఓ కూనలమ్మా ! 66

ముందు కెళితే నుయ్యి
వెనక చూస్తే గొయ్యి
రాజకీయము పొయ్యి
ఓ కూనలమ్మా ! 67

మోసపోతివి గదర
ప్రేమ పాశము గదర
సంసార మింతేర
ఓ కూనలమ్మా ! 68

కూనలమ్మ పదాలు

పాడి పంటలు ఎండి
పత్తిరైతులు మండి
మాడి చచ్చిరి లెండి
ఓ కూనలమ్మా ! 69

తొండి మాటల తోడి
పేదలను దునుమాడి
కూలి చత్తురు మాడి
ఓ కూనలమ్మా ! 70

రాచరికములు పోయి
ఏమి మారెను సోయి
వారసుల పైచేయి
ఓ కూనలమ్మా ! 71

దేశ రక్షణ కోరి
సరిహద్దులను చేరి
నీకన్న ఘనులేరి
ఓ కూనలమ్మా ! 72

కన్న పిల్లల కన్న
కన్నె పిల్లల కన్న
స్మార్టు ఫోనే మిన్న
ఓ కూనలమ్మా ! 73

కులము నమ్మిన వాడు
మతము నమ్మిన వాడు
బతుక నేర్చే వాడు
ఓ కూనలమ్మా ! 74

లేనిది భరించాలి
ఉందనుభవించాలి
జీవి జీవించాలి
ఓ కూనలమ్మా ! 75

మరణమ్ము ఈరోజు
కానున్నది రివాజు
మాను సెల్ఫీ మోజు
ఓ కూనలమ్మా ! 76

చేయి చేయీ కలుపు
చెలిమి ఇచ్చును మలుపు
అంది వచ్చును గెలుపు
ఓ కూనలమ్మా ! 77

కోటీశ్వరుడి కొడుకు
డబ్బు ఉందని మిడుకు
కాటికే కద కడకు
ఓ కూనలమ్మా ! 78

చెప్పేది కొండంత
చేయూత గోరంత
ఆచరణ అణువంత
ఓ కూనలమ్మా ! 79

ఊడిగము కొండంత
బాడిగలు గోరంత
శ్రమకేది చేయూత
ఓ కూనలమ్మా ! 80

జీతాలు కొండంత
చేసేది గోరంత
ఉద్యోగమొక వింత
ఓ కూనలమ్మా ! 81

కన్ను కొట్టుట సులువు
కన్ను కుట్టుట సులువు
పన్ను గట్టుట బరువు
ఓ కూనలమ్మా ! 82

వద్దు వందలు, వేలు
మంచి మాటే చాలు
బాధలన్నీ కూలు
ఓ కూనలమ్మా ! 83

వయసు పెరిగే కొద్ది
మంచి మాటలు దిద్ది
పెంచుకో నీ బుద్ధి
ఓ కూనలమ్మా ! 84

పరుల మేలును కోరి
పదవి కోరెడు వారి
పథము చిక్కుల దారి
ఓ కూనలమ్మా ! 85

అక్రమార్జన లోన
ఎన్ని దారులు ఉన్న
రాజకీయము మిన్న
ఓ కూనలమ్మా ! 86

చెడ్డ వారికి మెప్పు
మంచి వారికి ముప్పు
తెచ్చు గాదే తప్పు
ఓ కూనలమ్మా ! 87

తిడతారు కొడతారు
మేలు కోరే వారు
కారాదు బేజారు
ఓ కూనలమ్మా ! 88

రోగాల నిలయమ్ము
వాయు కాలుష్యమ్ము
రాబోవు ప్రళయమ్ము
ఓ కూనలమ్మా ! 89

డబ్బులుంటే చాలు
దండాలు వేవేలు
అందుకోరా జనులు
ఓ కూనలమ్మా ! 90

ఇంట ఈగల మోత
బయట దోమల వాత
ఈతి బాధల కూత
ఓ కూనలమ్మా ! 91

నడక నేర్పే వారు
నడత నేర్పే వారు
అన్నలంటే వారు
ఓ కూనలమ్మా ! 92

కూనలమ్మ పదాలు

పాప నవ్వుల లోన
రాలు వెన్నెల వాన
చూడ కుంతల కోన
ఓ కూనలమ్మా ! 93

నీవు నడచిన బాట
నీడలుంచిన చోట
కీర్తి మల్లెల తోట
ఓ కూనలమ్మా ! 94

అమ్మ పంచిన ప్రేమ
నాన్న పెంచిన ధీమ
స్వర్గమయ్యెను భూమ
ఓ కూనలమ్మా ! 95

పరుల కొంపలు గొట్టి
పదవులను చేపట్టి
పాపమున్నది చుట్టి
ఓ కూనలమ్మా ! 96

శోభన్ బాబు బొలుగాని

తండ్రి తాతల ఆస్తి
తగ్గకుండా కుస్తీ
స్విస్ బ్యాంకులో దాస్తి
ఓ కూనలమ్మా ! 97

రామాయణము రంకు
భారతమ్మొక బొంకు
యతుల కొరకే లింకు
ఓ కూనలమ్మా ! 98

మాటనిచ్చిన వాడు
మాట మార్చిన నాడు
కాగలడు నాయకుడు
ఓ కూనలమ్మా ! 99

వామ్మో ! వాహనము
సుదర్శనుడి చక్రము
మీదు మిక్కిలి నయము
ఓ కూనలమ్మా ! 100

కూనలమ్మ పదాలు

కన్ను ఆశలు పేర్చు
వెన్నుపోటులు కూర్చు
ఆలోచనలు మార్చు
ఓ కూనలమ్మా ! 101

జీవాత్మ అమ్మగా
పరమాత్మ నాన్నగా
దేహమీ జీవిగా
ఓ కూనలమ్మా ! 102

బోధ చేసే వారు
బాధలూడ్చే వారు
బావలొస్తే పోరు
ఓ కూనలమ్మా ! 103

ముద్ర పెడితే చాలు
దారి చూపును వేలు
మరువకుంటే మేలు
ఓ కూనలమ్మా ! 104

శోభన్ బాబు బొలుగాని

మంత్రముంటే చాలు
మననముంటే చాలు
లాభాలు వేవేలు
ఓ కూనలమ్మా ! 105

మందు నేర్పే వాడు
పొందు కూర్చే వాడు
బతుకు కూల్చే వాడు
ఓ కూనలమ్మా ! 106

జన్మ మాయల పుచ్చు
మనసు కోర్కెల ఉచ్చు
ఆపకుంటే హెచ్చు
ఓ కూనలమ్మా ! 107

మాయకే కాణాచి
మాయలేడిని చూచి
పెట్టినాదట పేచి
ఓ కూనలమ్మా ! 108

కూనలమ్మ పదాలు

పాలు పంచేవారు
నీట మునిగే వారు
తోడబుట్టిన వారు
ఓ కూనలమ్మా ! 109

ముందు నడిపే వారు
వెనుకనుండే వారు
మిత్రులంటే వారు
ఓ కూనలమ్మా ! 110

ఆపదొస్తే రారు
ఆస్తులుంటే పోరు
ఆప్తులౌనా వారు
ఓ కూనలమ్మా ! 111

కులమునడిగే వాడు
మతము కమ్మిన వాడు
అయ్యాడు మానవుడు
ఓ కూనలమ్మా ! 112

ఫేసు బుక్కును వదిలి
ముందుకెళ్ళరు కదిలి
బుక్కులకు జోలాలి
ఓ కూనలమ్మా ! 113

అణుబాంబు పేలాలి
అణువణువు చావాలి
మన మతము గెలవాలి
ఓ కూనలమ్మా ! 114

అవ స రమ ఈ బతుకు
చావు తప్పున తుదకు
ఆత్మ కోసము వెదకు
ఓ కూనలమ్మా ! 115

గొప్పలకు పోవద్దు
అప్పులను తేవద్దు
ఆప్తులను చంపొద్దు
ఓ కూనలమ్మా ! 116

ముద్రించు పుస్తకము
మెచ్చదే సహృదయము
బయోడేటా పరము
ఓ కూనలమ్మా ! 117

నీలోన నీ పూత
మారు నా తలరాత
కళకేది చేయూత
ఓ కూనలమ్మా ! 118

కడుపు నిండని వారు
కడుపు పండని వారు
దేనికీ కొరగారు
ఓ కూనలమ్మా ! 119

కొడుకులుంటే మురిసి
కూతురున్నదా కసి
కామార్తులకు జడిసి
ఓ కూనలమ్మా ! 120

రగడలంటే ప్రీతి
రగడ వల్లే ఖ్యాతి
కాళోజి రస విభూతి
ఓ కూనలమ్మా ! 121

మితిమీరిన రౌద్రం
సినిమాల్లో భద్రం
రసపోషణ ఛిద్రం
ఓ కూనలమ్మా ! 122

శత్రువుల చెండాడి
దేశమును కాపాడి
అమరమ్మొ నీ బాడి
ఓ కూనలమ్మా ! 123

అప్పులేమో దండి
దిగుబడులు జగమొండి
ప్రశ్నార్థకము తిండి
ఓ కూనలమ్మా ! 124

ఆకలి దప్పులు సైతము
ఓర్చు కొందురు జనము
స్మార్టు ఫోనుల తరము
ఓ కూనలమ్మా ! 125

మంచి గంధము పూసి
గొప్ప రచనలు చేసి
వన్నెకెక్కె సహవాసి
ఓ కూనలమ్మా ! 126

బతుక నేర్పే చదువు
ఫలములిచ్చే తరువు
భవిత పాలిటి మధువు
ఓ కూనలమ్మా ! 127

అడిగినది అడగడము
చెప్పినది చెప్పడము
మనసుకు ముసలితనము
ఓ కూనలమ్మా ! 128

అమ్మకానికి చదువు
అమ్మకానికి కొలువు
చదువులమ్మకు సెలవు
ఓ కూనలమ్మా ! 129

మాట తప్పిన నాడు
పూట గడవదు చూడు
అనలేను ఈనాడు
ఓ కూనలమ్మా ! 130

కాయ కష్టము చేసి
ఇష్టసుఖములు బాసి
అభివృద్ధి పడకేసి
ఓ కూనలమ్మా ! 131

నాయకుల హామీలు
పాలకుల బీరాలు
పాలితుల కష్టాలు
ఓ కూనలమ్మా ! 132

నిలువ నీడయు లేక
తినుటకన్నము లేక
బతకాలి కడదాక
ఓ కూనలమ్మా ! 133

పంట నివ్వని చేలు
కడుపునింపని పాలు
వరుస కల్తీ చాలు
ఓ కూనలమ్మా ! 134

బతుకు భారము కనుక
ప్రజల బాధలు గనక
రాజకీయము కినుక
ఓ కూనలమ్మా ! 135

మంచి కవితలు గోరు
కువిమర్శకులు గలరు
రాయ ముందుకు రారు
ఓ కూనలమ్మా ! 136

అదిగదిగొ చూడండి
వేగమాపని బండి
బతుకు నావకు గండి
ఓ కూనలమ్మా ! 137

ఒక్క రోజున నీవు
గొప్ప వాడవు కావు
శ్రమ శక్తులు గొలువు
ఓ కూనలమ్మా ! 138

మనిషికుండు అసూయ
లోతు చూడగ లోయ
అంతు చిక్కని మాయ
ఓ కూనలమ్మా ! 139

నోరు తెరువగ డబ్బు
చేయి ఆడితె డబ్బు
కాలు కదిపితె డబ్బు
ఓ కూనలమ్మా ! 140

అన్నమెట్టెడు వారు
వెన్ను తట్టెడు వారు
పూ జనీయులు వారు
ఓ కూనలమ్మా ! 141

మూడు పాదము లందు
అంత్య ప్రాస లవిందు
నీకు మాత్రమె చెందు
ఓ కూనలమ్మా ! 142

బుద్ధిమంతుడ నేను
గ్రంథచౌర్యమెరుగను
నాప్రతిభ ఇంతేను
ఓ కూనలమ్మా ! 143

ఒక్కరైనా చాలు
చదివితే పదివేలు
ఇక నీకు వీడ్కోలు
ఓ కూనలమ్మా ! 144

కవి పరిచయం



పూర్తి పేరు : శోభన్‌బాబు బొలుగాని

జన్మస్థలం : పెద్దముప్పారం గ్రామం,
దంతాలపల్లి మండలం,
మహబూబాబాద్ జిల్లా.

తల్లిదండ్రులు : శ్రీమతి అనసూర్య,
కీ.శే. శ్రీ పిచ్చయ్య

చదువు : హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి M.A.(2011-13),
M.Phil.(2014), Ph.D.(2020)

వృత్తి : తెలుగు లెక్చరర్ (డిగ్రీ)

పరిశోధన : *సుధాకర కవితాజ్యోత్స్న- ఒక పరిశీలన*
(M.Phil.Thesis.అముద్రితం)
నల్లదీగ శ్రీనివాసాచార్యుల కట్టబ్రహ్మన చరిత్ర-కావ్యానుశీలన
(Ph.D.Thesis.అముద్రితం)

కవిత్వం : త్వరలో పుస్తక రూపంలో రానున్న రచనలు

1. *ఒక నేను - ఒక తను* (వచన కవితలు)
2. *ఆశల దారాలు* (వచన కవితలు)
3. క్లుప్తంగానీకాలం (నానీలు)
4. వెలుతురు ఖడ్గం (హైకూ e-book 2024)
5. హైకూలహరి (హైకూ)
6. చూపుల వేట (హైకూ)
7. *పుత్రా....(72 కంద పద్యాలు* e-book 2025)